క్లుప్తంగా

కెమిస్ట్రీలో డాక్టరేట్



వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర శాఖ పరిశోధకులు వై.వి.దివ్యశ్రీకి వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయు కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎన్.సి. గంగిరెడ్డి పర్యవేక్షణలో 'ఇటానియం బేస్డ్ నానో క్యాటలిస్ట్ డే డిగ్రీడేషన్ హైడ్రోజన్ ప్రొడక్షన్ అండ్ ఆర్గానిక్ ట్రాన్స్ఫర్మేషన్' అనే అశంపై ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

28న సాహిత్య సదస్సు

కడప కల్చరల్ : నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 28వ తేదీన సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో సాహిత్య సదస్సు నిర్వహించనున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పేట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఈ కేంద్రంలో 134వ సదస్సులో భాగంగా సాయంత్రం 5 గంటలకు రాయలసీమ నదీ సాహిత్యం అంశంపై రచయిత కొత్తపల్లి రామాంజనేయులు ప్రసంగించనున్నట్లు ఆయన తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని మున్సిపల్ కార్మికుల కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్మికులు నివసిస్తున్న ప్రాంతాన్ని సీఐటీయూ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తీర్చడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారు నివసిస్తున్న ప్రాంతాల్లో వీధిలైట్లు లేక మంచి నీటి కనెక్షన్ లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రారెడ్డి, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య శాస్త్ర విద్యార్థులకు చక్కటి అవకాశాలు

వైవీయూ: వాణిజ్య శాస్త్రానికి చక్కటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఎప్పటికప్పుడు సరికొత్త జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కే. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని 21వ శతాబ్ది గురుకులంలో కామర్స్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఒక దీపదారిలా ఉండేలా జ్ఞానాన్ని పొందాలన్నారు. విశిష్ట అతిథి వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నిత్యం సానుకూల ఆలోచనలు చేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ కామర్స్ డిమాండ్ ఉన్న సబ్జెక్ట్ అని గుర్తుచేస్తూ చదవడం అదృష్టంగా భావించాలన్నారు. కామర్స్ ఆచార్యులు జి. విజయ భారతి, విభాగాధిపతి డాక్టర్ హరినాథ్, అకడమిక్ కన్సల్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు మంగళవారం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కడప డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. దీంతోపాటు పెరిగిన పనిభారంతో బాటు సమస్యలు పరిష్కారంకాక ఉపాధ్యాయుల అసంతృప్తి తీవ్రస్థాయిలో ఉన్నదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సివి రమణ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడాలి

వైవీయూ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జి. విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసే బడ్జెట్ ఇది

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే బడ్జెట్ గా ఉందని యువజన సమాఖ్య మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్- నిరుద్యోగం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శివకుమార్, చిన్ని, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సకాలంలో ఇస్తే రైతులకు మేలు..



రైతులు పంటలసాగు కోసం ప్రభుత్వం అందించే రైతు బరోసా సకాలంలో ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. అలా కాకుండా రైతులు అప్పులు తెచ్చుకుని పంటలన్నీ సాగు చేసుకున్నాక ఇస్తే ఆ డబ్బులతో రైతులకు ఎం లాభం. అప్పులు తెచ్చుకున్న డబ్బులకు వడ్డికి సరిపోతాయి. అలా కాకుండా రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచించాలి.

- మునిరెడ్డి, పాతకడప

ఎదురు చూస్తున్నా...



మాది పాతకడప. నాకు మూడు ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం వరిపంటను నాటేందుకు సిద్ధమవుతున్నా. ప్రభుత్వం రైతు బరోసా డబ్బులు వేస్తే విత్తనాలు వడ్డుకైనా వస్తుందనుకుంటే వేయలేదు. గత ప్రభుత్వంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతు బరోసా పండింది. నూతన ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా రైతులు గురించి చర్చించి రైతు బరోసా వేయాలి.

- కర్నాటి రమణారెడ్డి, రైతు

గడిచిన ఐదేళ్లలో కడప నియోజకవర్గంలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద విడుదలైన నిధులు వివరాలు ఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
2019–20	2,634	3, 55, 05, 900
2020–21	2,154	2, 90, 79, 000
2021–22	1,962	2, 64, 87, 000
2022–23	1,679	2, 26, 66, 500
2023–24	1,714	2, 31, 39, 500

- కొత్త ప్రభుత్వం కొలువుదీరి 50 రోజులైనా ఊసే లేని సాయం
- నేటికీ సాయంపై ప్రకటన చేయని సీఎం చంద్రబాబు
- అన్నదాతా సుఖీభవ ఎప్పుడిస్తారంటూ రైతుల మండిపాటు

సాగుకు సాయం ఏదీ.?

'అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.' అని ఎన్నికల ముందు టీడీపీ కూటమి ఊదరగొట్టింది. సూపర్‌సిక్స్ హామీలలో ఇది ఒకటని ప్రచారం చేశారు. ఎన్నికలు ముగిసి టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. ఇదే సమయంలో ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతాంగం పంటల సాగు పనుల్లో ఉన్నారు. అయితే గత ఐదేళ్లలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతాంగానికి చెప్పిన మేరకు వైఎస్సార్ రైతు భరోసా పథకం క్రమం తప్పకుండా అమలు చేసింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ఇంకా రూపుదాల్చలేదు. ఫలితంగా రైతులకు ప్రభుత్వం నుంచి చేయూత కరువైంది. వెంటనే రూ. 20 వేల ఆర్థిక సాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



4,639 కడప నియోజకవర్గంలో రైతుల సంఖ్య

నియోజకవర్గంలో మొత్తం భూమి హెక్టార్లలో **3,562**

1520 నియోజకవర్గంలో సాగు భూమి విస్తీర్ణం హెక్టార్లలో

50 ప్రస్తుతం సాగైన విస్తీర్ణం హెక్టార్లలో

సాగయ్యే ప్రధాన పంటలు: వరి, ఉల్లి, మినుము, కొర్ర

కడప అగ్రికల్చర్: ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. వర్షాలు కురుస్తున్నాయి. చాలా మంది రైతులు పంటల సాగుకు సన్నద్ధమౌతున్నారు. ఇప్పటికే కడప నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 50 హెక్టార్లలో వరిపంట సాగు చేశారు. ఈ పరిస్థితుల్లో వీరికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలివిడత సాయంగా గత నెలలో రైతు ఖాతాలకు రూ. 2 వేలు చొప్పన 1,714 మంది రైతులకు రూ. 34.28 లక్షలు జమ చేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ వాటా సహాయం కోసం నియోజకవర్గ రైతాంగం ఎదురు చూస్తోంది.

గత ప్రభుత్వం హయాంలో ఆరంభంలోనే పెట్టుబడి సాయం...

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందించి రైతులకు అండగా నిలిచేవారు. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందజేసింది.

రాష్ట్రసాయం కోసం ఎదురు చూపు...

తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాది రూ. 20 ఇస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆ తర్వాత ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చి సీఎం కూడా అయ్యారు. కానీ రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ గురించి మాత్రం నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా స్పందించి అన్నదాత సుఖీభవ మొదటి విడతను ఖాతాలకు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

పంటలసాగు సమయంలో వేస్తే...



రైతులు పంటలు సాగు చేసే సమయంలో పెట్టుబడికి సాయం అందజేస్తే బాగుంటుంది. ఎందుకంటే బయట నుంచి పూర్తిగా అప్పులు తెచ్చుకోకుండా అంతో ఇంతో రైతుకు ఖర్చులకు సాయంగా ఉంటుంది. అలా కాకుండా సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తుంటే ఇప్పటికే అన్నదాతా సుఖీభవ డబ్బులు ఇవ్వకుంటే పంటలసాగు ఎలా చేసుకోవాలి. ప్రభుత్వ పెద్దలే ఆలోచించాలి.

- చల్లా శ్రీనివాసులరెడ్డి, రైతు, కడప

చెప్పిన మాట ప్రకారం ఇవ్వాలి



మాది దేవుని కడప. నాకు రెండు ఎకరాలకు పైనే వ్యవసాయ పొలం ఉంది. ఎన్నికల సమయంలో అన్నదాతా సుఖీభవ పథకం అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చారు. చెప్పిన మాట ప్రకారం రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులు పడేలా సహాయం చేయాలి.

- ఒంటేరు చిన్న సుబ్బయ్య, దేవుని కడప.

ఇన్‌సర్వీస్ బీపీఈడీకి అవకాశం కల్పించాలి

కడప స్పోర్ట్స్: జిల్లాలో అర్హత కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు ఇన్‌సర్వీస్ బీపీఈడీ చేసుకునేందుకు అవకాశం, అనుమతి ఇవ్వాలని వైఎస్ఆర్ కడప జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం. అనూరాధాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో పదోన్నతులు పొందిన ఎస్ఏ పీఈలు వేర్వేరు తేదీల్లో పాఠశాలల్లో చేరడం వలన తదుపరి జరిగే బదిలీలు, పదోన్నతుల్లో ఇబ్బందులు ఎదురవుతాయని పదోన్నతి పొందిన ఎస్ఏ పీఈలకు అందరికీ 2019 నవంబర్1వ తేదీన కామన్ సీనియారిటీగా పరిగణించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మాధవరెడ్డి, సందానిబాషా పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రాష్ట్ర బాషోపాధ్యాయ సంస్థ నాయకులు

కామన్ సీనియారిటీ తేదిని ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 2019లో పదోన్నతులు పొందిన భాషోపాధ్యాయులందరికీ కామన్ సీనియారిటీ తేదీని నవంబర్ ఒకటిగా పరిగణించాలని రాష్ట్రభాష ఉపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు బత్తల వెంకట ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్ కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషా ఉపాధ్యాయ సంస్థ రాష్ట్ర కోశాధికారి భోగా గంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు ఘనంగా వీడ్కోలు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్‌కు కార్పొరేషన్ కార్మికులు, ఉద్యోగులు ఘన వీడ్కోలు పలికారు. మంగళవారం రిలీవ్ అయిన ఆయనకు పూలు జల్లి, జ్ఞాపిక ఇచ్చి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పనిచేసిన కాలంలో కార్మికులు తనకు బాగా సహకరించి, కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సాయపడ్డారన్నారు. వారివల్ల తాను ఎన్నో విషయాలు నేర్చుకొని పనిచేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్. రవి, కె. తిరుపాల్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు జ్ఞాపిక బహుకరిస్తున్న మున్సిపల్ కార్మికులు

బ్రోచర్ ఆవిష్కరణ

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈనెల 27వ తేదీన జంతుశాస్త్రశాఖ ఆధ్వర్యంలో »సుస్థిర అభివృద్ధి సాధనలో పర్యావరణ సవాళ్లు« అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జంతుశాస్త్రశాఖ విభాగాధిపతి, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. పి. రవిశేఖర్, కన్వీనర్ డా. వై. సావిత్రి ఆధ్వర్యంలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. బి. సుధాకర్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: నగరంలోని ఆర్టీసీ బస్టాండులో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ వాడి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాతపడటం, తీవ్రంగా గాయపడటం జరుగుతోందన్నారు. ఇటువంటి తరుణంలో వాహనదారులు చైతన్యవంతులు కావాలన్నారు. ప్రతి వాహనదారుడు తమ భద్రతతోపాటు కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని బయటికి వెళ్లినపుడు క్షేమంగా తిరిగి ఇంటికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ అధికారులు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

హాస్టల్స్‌ను తనిఖీ చేసిన వైవీయూ అధికారులు



నీటి నిల్వ ట్యాంకులను పరిశీలిస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం బాలబాలికల వసతి గృహాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మతో కలిసి తనిఖీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో వారు వసతి గృహానికి వచ్చారు. విద్యార్థులు తింటున్న ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. అనంతరం కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మరిన్ని సౌకర్యాల గురించి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. వంటశాల, డైనింగ్ హాల్ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం నీటి నిల్వ ట్యాంకులను పరిశీలించారు. వీసీ వెంట ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై జన స్పందన

ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణం



కేంద్ర బడ్జెట్ లో జిల్లాలోని ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణం. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వేలాది మంది నిరుద్యోగ యువతకు కడుపు నింపే పరిశ్రమకు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం బాధాకరం. - రవిశంకర్‌రెడ్డి , ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

పరిశోధనలకు మరింత ప్రోత్సాహం అవసరం..



కేంద్ర బడ్జెట్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్)పై ఆశించిన మేర నిర్ణయాలు, నిధులు లేకపోవడం నిరాశపరిచింది. ఎన్ఆర్ఎఫ్ ఏర్పాటు బిల్లును ఆమోదించినప్పటికీ సంస్థకు కేటాయింపులు లేకపోవడం విచారకరం. గతంలో ఎన్ఆర్ఎఫ్ ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్న ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో దాని ఊసేలేదు.
- డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, భౌతిక శాస్త్రవేత్త, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

ప్రయోజనకరంగా లేని బడ్జెట్



ప్రభుత్వ ఉద్యోగలకు కొత్త పన్ను స్టాండర్డ్ డిడక్షన్‌లో ఆదాయ పరిమితి 75 వేలు కాకుండా 1.50 లక్షలు పెంచి ఉంటే ఉద్యోగలకు పెద్ద ఊరట ఉండేది. 80 సి, 80 సిసిఈలో 1.5 లక్షలు నుండి 3లక్షలు వరకు మినహాయించి ఉంటే ఉద్యోగలకు మంచి ప్రయోజనకరంగా ఉండేది. పాత స్లాబ్‌లో ఏమి మార్పు లేకపోవడం నిరాశ కల్గించే విషయం. - ఎస్. నజీబుల్లా, ఎస్ టి యు జిల్లా కార్యదర్శి, కడప జిల్లా

రైతులకు నష్టం కలిగించే బడ్జెట్



వ్యవసాయం అనుబంధ రంగాలకు కేటాయించింది.రూ. 1.52 లక్షల కోట్లు మాత్రమే. ఇప్పటికీ 65శాతం జనాభాకు బతుకుదెరువు కల్పిస్తోంది వ్యవసాయ రంగం మాత్రమే. కానీ కేటాయింపులు నామ మాత్రం. రూ. 5లక్షల లోపు పంట రుణాలపై ప్రస్తుతం వసూలు చేస్తున్న 7శాతం వడ్డీ తగ్గింపు చెప్ప లేదు. రైతులకు వద్ధాప్య పెన్షన్ పథక ప్రకటన లేదు.

-జి. ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

వేతన జీవులకు నిరాశ



బడ్జెట్ వేతన జీవులకు నిరాశ కలిగించింది. దీనివల్ల 'న్యూ టాక్స్ రెజిమ్'లో మాత్రమే కాస్త ఆదాయం పన్ను తగ్గింది. 6 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి ఏ తగ్గింపూ లేదు. 6 లక్షల నుంచి 9 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి 5 వేల రూపాయల మేర, 9 లక్షల నుండి 15 లక్షలు ఆ పైన ఆదాయం ఉన్నవారికి పదివేల రూపాయల మేర మాత్రమే ఆదాయం తగ్గింది.

- ఎ.రఘునాథరెడ్డి, కార్యదర్శి, అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం, కడప

ఊరట ఇవ్వని కేంద్ర బడ్జెట్



ఉద్యోగులు ఆశించిన విధంగా పన్ను నిబంధనలను కేంద్ర బడ్జెట్లో మార్చకపోవడం శోచనీయం. జీవన వ్యయాన్ని, ధరల సూచిక , ద్రవ్యోల్బణం అంశాలను దృష్టిలో పెట్టుకొని ఆదాయం పన్ను శ్లాబులు మార్చకపోవడం బాధాకరం. అలాగే పన్నులకు సంబంధించిన శ్లాబులను ఆశించిన రీతిలో మార్పు చేయలేదు. ఉద్యోగులకు ఈ బడ్జెట్‌లో ఊరట లేదు.

- సీపీ ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఏపీటీఎఫ్ అమరావతి

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు హెచ్చరిక

కడప అర్బన్: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం చట్టవ్యతిరేకమని, నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా లోని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలను పోలీస్ అధికారులు, సిబ్బంది గుర్తించి, పంచాయతీరాజ్/మున్సిపల్ శాఖల సిబ్బంది సహకారంతో స్వయంగా శుభ్రం చేయించారు.



బహిరంగప్రదేశాలలో తాగి పడేసిన మద్యం సీసాలను తొలగిస్తున్న పోలీసులు

ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు

కడప అర్బన్: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఆర్డీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో వైఎస్ఆర్ జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో పోలీసు నిఘాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలోనే కడప ఆర్డీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంలలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం వరకు 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్'(ఎల్‌హెచ్‌ఎంఎస్)పరికరాలను అమర్చారు. కార్యాలయాల వద్ద రాత్రిపూట వాచ్‌మెన్‌తో పాటు, సాంకేతికంగా నిఘా ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే ఎల్‌హెచ్‌ఎంఎస్‌లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నారు.